మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

**మక్తల్ టౌన్,అక్టోబరు 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని 36 గ్రామ పంచా యతీలలో పని చేస్తున్న గ్రామ పంచా యతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలం గాణ ప్రగతిశీల గ్రామ పం చాయతీ వర్కర్స్ యూని యన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూ నియన్ మండల కార్యదర్శి నరేష్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్. కిరణ్ పాల్గొని మాట్లాడుతూ మండలపరిధిలో 130కిపైగా గ్రామపంచాయతీ కార్మికులు పని చేస్తున్నారన్నారు. కార్మికులకు సేఫ్టీకిట్స్ ఇవ్వడంలేదన్నారు. రెండు వేతనాలు పెండింగ్‌లో పెట్టుకుని కార్మి కులతో పని చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు జతల బట్టలు, ప్రతినెల సబ్బులు,నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఇన్సూ రెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించని ఎడల జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంక టేష్, మల్లేష్, రాము, నరసింహులు, వెంకటయ్య, చంద్రప్ప, నబి రామచంద్ర పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

# సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదు

**నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**

**నారాయణపేట టౌన్,అక్టోబరు 16 ప్రభాతవార్త :** జిల్లా పరి ధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్య లు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు. ఆయన ఒక ప్రకటన లో మాట్లాడుతూ రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయం గాను ప్రజల భద్రతకు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సా మాజిక మాధ్యమాలు అయిన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రామ్, వాట్సాప్ గ్రూమాలలో ఇతరుల కు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గాన్ని కించపరిచే విధంగా ఉన్న తమకు తెలియని విడియో లు, ఫొటోలు, పోస్టులు చేసిన వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్‌ని బాధ్యుడ ిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. సామాజిక మాధ్యమాలను మంచి పనులను తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపై ప్రత్యేకంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకుని వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

ఎస్పీ యోగేష్ గౌతమ్

# ఉపాధి హామీ పథకం పనులు గుర్తించని అధికారులు...

**మండలాధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన డీఆర్డీఓ పీడీ ఓబులేష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులను గుర్తించి అవసర మైన ప్రణాళికలు రూపొం దించడంలో మండలాధికారు లు నిర్లక్ష్యం వహించడంపై డీఆర్డీఓ పీడీ ఓబులేష్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. గ్రామ సభలు నిర్వహించి కనీసం పనులు గుర్తించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తిమ్మాజిపేట మం డలకేంద్రంలో ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టాల్సిన న్యూ ఫార్మేషన్ రోడ్డు ప్రాంతాన్ని స్థానిక అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకం క్రింద ఏ ఏ పనులు గుర్తించారు, వాటికి సంబం ధించిన రికార్డులు ఏవి ఎన్ని పనులు గుర్తించారు తదితర అంశాల గురించి ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లను, పంచాయతీ కార్యదర్శిని ఆయన అడిగారు. పనుల గుర్తింపుపై సరైన సమాధానం చెప్పకపోవడంతో పీడీ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పనులకు సంబంధించిన రికార్డులను నమోదు చేయాలని ఆయన సూచించారు. ఎప్పటికప్పుడు ఉపాధి హామీ పనుల పట్ల పూర్తి వివరాలు రికార్డు పరంగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సెక్రటరీ రాఘవేందర్, టీఎలు లక్ష్మి, తాజుద్దిన్, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు ఉన్నారు.

అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్డీఓ పీడీ ఓబులేష్

# 18న కళా ఉత్సవ్ పోటీలు..

**జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 16 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో సృజనాత్మక కళా నైపుణ్యాల ను వెలికి తీసేందుకు కళా ఉత్సవ్ 2024 పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌విఎం సమావేశ మందిరంలో పోటీలు జరుగుతాయని డీఈఓ తెలిపారు. ఉదయం 10 గం.లకు పోటీలు ప్రారంభమవుతాయని జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుందని డీఈఓ తెలిపారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల విద్యాసంస్థలతో పాటు గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థలు పోటీలలో పాల్గొనవచ్చని డీఈఓ తెలిపారు.వికసితభారత్,విజన్ భారత్ 2047 అంశాలపై పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు.విద్యార్థులు 10గం.ల వరకు ఆర్‌విఎం సమావేశ మందిరానికి చేరుకోవాలని డీఈఓ సూచించారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని డీఈఓ తెలిపారు. గ్రూపు విభాగంలో ఐదుమంది విద్యార్థులకు మించి ఉండకూడదని వ్యక్తిగత విభాగంలో ఒకరు మాత్రమే పాల్గొనాలని విద్యార్థులు తప్పనిసరిగా స్కూల్ యూనిఫామ్ పైనే ప్రదర్శనలు ఇవ్వవలసి ఉంటుందని డీఈఓ తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే మండల సిఆర్‌పిలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు.

# బలహీన వర్గాల కోసం పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయం

**ఖిల్లాఘణపురం అక్టోబర్ 16 ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాల కోసం పండుగ సాయన్న చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంద ని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని షాపూర్ గ్రామంలో ముదిరాజు కమి టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి న పండుగ సాయన్న విగ్ర హ ఆవిష్కరణ కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రసం గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజా కార్ల పరిపాలనలో నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్న సమయంలో నేనున్నానంటూ పేద ప్రజల కోసం వారి ఆకలి తీర్చడానికి ఉన్నవారిని దోచి లేని వారికే దానం చేశాడని పండుగ సాయన్న మహోన్నత వ్యక్తి అని పండగ సాయన్న చరిత్రను పుస్తకాలలో లిఖించకపోయిన గ్రామీణ ప్రాంతాలలోని బుడగజంగాలు కిన్నెర వాయిద్యాలవారు భిక్షకులు పండగ సాయన్న చరిత్రను మొగులయ్య తన 12 కిన్నెరల వాయిద్యంతో తెలంగాణలో మారుమోగించాడని పండుగ సాయన్నను ఆదర్శంగా తీసుకొని గ్రామాల లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని గ్రామాలలో పార్టీలకతీతంగా అందరూ కలిసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. షాపూర్ గ్రామ ముదిరాజ్ కమిటీ

– మిగతా4లో..

పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

## బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**గద్వాల్ అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ఈ నెల 18న జరగబోయే గద్వాల్ జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార ఉత్సవ కార్యక్రమంకు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ బుధవారం పరిశీలించారు.ఈకార్యక్రమానికి విచ్చే స్తున్న మంత్రుల బృందానికి స్వాగతం పలకడానికి సంబంధించి సభాస్థలి ఏ ర్పాట్లను, స్థానిక పోలీస్ అధికారులతో చర్చించారు. సమావేశ ఏర్పాట్లను ఏఐ సీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ శాసనసభ్యులు డా.ఎస్ ఏ సంపత్‌కుమార్, పోలీసు అధి కారులు, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, ఇస్మాయిల్, సీతారామి రెడ్డి, శంకర్, దిలీప్, దినేష్, సత్యం, తదితరులు ఉన్నారు.

స్థలాన్ని పరిశీలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్

## రెండేళ్లలో అభివృద్ధి చేసి చూపిస్తా..

- అభివృద్ధిని అడ్డుకుంటే ఇకపై సహించను
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హెచ్చరిక
- నసరుల్లాబాద్ పెద్ద చెరువులో చేప పిల్లలు విడుదల

నస్రుల్లాబాద్ చెరువులోకి చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

**జడ్చర్ల,అక్టోబరు 16 ప్రభాతవార్త :** అసలైన అభివృద్ధి అంటే ఏమిటో రెండేళ్లలో చేసి చూపిస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. గత పదేళ్ల కాలంలో ఎన్నడూ లేనంత స్థాయిలో నియోజకవర్గానికి నిధులను తీసుకువస్తామని చెప్పారు. అయితే తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను బిఆర్ఎస్ నాయకులు అడ్డుకోవాలని చూస్తే ఇకపై సహించబోమని హెచ్చరించారు. జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ పెద్ద చెరువులోకి బుధవారం ఆయన మత్స్యశాఖ ఆధ్వర్యంలో 60 వేల చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగానే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనేక దౌర్జన్యాలు, నిర్బంధాలకు గురయ్యారని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తాను బిఆర్ఎస్ నాయకుల విషయంలో సంయమనం పాటించాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరానని చెప్పారు. రెండేళ్లపాటు పూర్తిగా నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి పెట్టి, తాను ఏ మేరకు అభివృద్ధి చేయగలనో చేసి చూపిస్తానని కార్యకర్తలకు చెప్పానన్నారు. ఇప్పటికే గడచిన 11 నెల కాలంలో ఎన్నో అభివృద్ధి పథకాలను, నిధులను తాను నియోజకవర్గానికి తీసుకువచ్చానని, ముఖ్యంగా బిఆర్ఎస్ పాలనలో అధ్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి చేయడానికి గత పదేళ్ల కాలంలో ఎన్నడూ రానంత ఎక్కువగా నిధులను తీసుకువచ్చామని గుర్తు చేశారు. అయితే కొందరు బిఆర్ఎస్ నాయకులు తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయితే అలాంటి పనులపై ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. కాగా నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న 386 చిన్నా, పెద్దా చెరువులు, కుంటల్లోకి ఈ ఏడాది ఇకూడా 24.72 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం వేస్తోందని చెప్పారు. నియోజకవర్గంలో నస్రుల్లాబాద్, మిడ్జిల్ చెరువులు రెండు పెద్దవి కాగా ఈ ఏడాది వీటిలోకి 90 వేల చేప పిల్లలను వేయడం జరుగుతోందని తెలిపారు. చిన్న చెరువులు, నీటి కుంటల్లో 23.82 లక్షల బంగారు తీగ రకానికి చెందిన చేప పిల్లలను వేయడం జరుగుతోందని అనిరుధ్‌రెడ్డి చెప్పారు. గ్రామస్తులు ఈ చెరువులు, కుంటల్లోని చేపలను సంరక్షించుకోవాలని కోరారు. నస్రుల్లాబాద్ చెరువు కట్టను మిని ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయడానికి కూడా చర్యలు తీసుకుంటామని, దీనికి ఈ ఏడాది బడ్జెట్‌లోనే నిధులను తీసుకువస్తామని అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. నస్రుల్లాబాద్ చెరువుకట్ట మరమ్మతులకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నస్రుల్లాబాద్‌కు 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరయిందని దాని నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించే పనిని త్వరగా పూర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పనులను ప్రారంభించాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. కార్యక్రమంలో బాదేపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ తంగెళ్ల జ్యోతి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు రాధారోహిణి, తహసిల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపిడిఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# మూడు కోట్ల అవినీతి నివేదిక ఎక్కడ..

- అడ్డాకుల గ్రామ పంచాయతీలో అక్రమాల విచారణ నివేదిక మాయం..?
- నాలుగు నెలలైనా జిల్లా కలెక్టర్, డిపిఓలకు అందని నివేదిక
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు... అయోమయంలో ప్రజలు

గ్రామ పంచాయతీ కార్యాలయం

**అడ్డాకుల,అక్టోబరు16 ప్రభాతవార్త:** మూడు కోట్ల అవినీతి నివేదిక మాయమైంది.అడ్డాకుల గ్రామపంచాయతీ అవినీతిపై విచారణ చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి పండరినాథ్‌ను అ ప్పటి జిల్లా కలెక్టర్ రవినాయక్ ఆదేశించగా విచారణ చేపట్టిన డిపిఎల్‌ఓ నివేదికను తొక్కిపెట్టారు. విచారణ చేపట్టి నాలుగు నెలలైనా జిల్లా కలెక్టర్, డిపిఓలకు అవినీతిపై జరిపిన విచారణ నివేదిక ఇంతవరకు అందలేదు.ఇందుకుకారణం డివిజనల్ పంచాయతీ అధికారి నిర్ల క్ష్యం అవినీతిని రూపుమాపాల్సిన అధికారులే దానికి వత్తాసు పలు కుతున్నట్లు ఈ సంఘటన చూస్తే అర్థమవుతుంది. ఇందుకు సం బంధించిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి.అడ్డాకుల గ్రామపంచా యతీలో మూడు కోట్ల అవినీతి జరిగిం దని కొంత మంది సమాచా ర హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోగా విషయం బయటకు వచ్చింది. చాలా పనులు వేయకుండానే చేసినట్లుగా ఎంబి రికార్డు లు సృష్టించి నిధులు కాజేసినట్లు తెలిసింది. ఒక నంబర్‌తో ఒకే పని రెండుసార్లు చేసినట్లుగా ఎంబి రికార్డులు తయారు చేసినట్లు, గ్రామంలో జిమ్ము, చిన్నపిల్లల పార్కు ఏర్పాటు చేశారని కొన్ని సం దర్భాలలో ఎలాంటి పనులు చేయకుండానే అడ్వాన్స్ చెక్కులు ఒక వ్యక్తి పేరుపై ఇవ్వడం జరిగిందని, ఐదు సంవత్సరాలలో జరిగిన అవినీతి మొత్తం మూడు కోట్ల రూపాయలకు పైగా జరిగిందని గత నాలుగు నెలల కింద కొన్ని వార్తా పత్రికలు, యూట్యూబ్ ఛానల్ లో ప్రసారమయ్యాయి. దీనికి స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ రవినాయక్ అడ్డాకుల గ్రామ పంచాయతీ అవినీతిపై విచారణ జరిపించాలని డివిజనల్ పంచాయతీ అధికారిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆదేశానుసారం అడ్డాకుల గ్రామ పంచాయతీలో గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు జయవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు నాయక్,నాగేష్, సరస్వతిలను డివిజనల్ పంచాయతీ అధికారి పండరీనాథ్ రెండు రోజుల పాటు గ్రామ పంచాయతీల్లో విచారణ చేపట్టారు. అనంతరం నివేదిక ఎక్కడఉందో ఎవరికి తెలియడం లేదు. అడ్డాకుల గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతిపై చేపట్టిన విచారణ నివేదికకు సంబంధించిన జిరాక్స్ కాపీలు ఇవ్వాల్సిందిగా అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన రవికుమార్‌గౌడ్, జిల్లా కలెక్టర్, డిపిఆర్ఓ కార్యాలయాలలో మూడు నెలల కింద ఆర్‌టిఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. ఎలాంటి నివేదిక తమ కార్యాలయానికి అందలేదని, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి లెటర్ వచ్చింది. అనంతరం నెల రోజుల తర్వాత డిపిఓ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోగా నెల రోజుల వరకు ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో ఆర్‌టిఐ కింద డిపిఓకు మొదటి అప్పీల్ చేసుకోవడం జరిగింది. మొదటి అప్పీల్ చేసిన నెల రోజుల తర్వాత గ్రామ పంచాయతీకి సంబంధించిన విచారణ నివేదిక ఇంకా మా కార్యాలయానికి అందలేదని డిపిఓ కార్యాలయం నుండి సమాధానం వచ్చింది. జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించిన తర్వాత రెండు రోజులకు విచారణ చేపట్టినా అట్టి నివేదిక నాలుగు నెలలైనా ఇంతవరకు జిల్లా కలెక్టర్, డిపిఓ కార్యాలయాలకు అందకపోవడంతో విచారణ అధికారిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం గురించి బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగింది. వారం లోపల నివేదిక అందజేస్తామని అవినీతి విచారణ చేపట్టిన డివిజనల్ పంచాయతీ అధికారి పండరీనాథ్ ఇటీవల రిటైర్మెంట్ కావడం జరిగింది. వారంలోనే నివేదికను అందజేస్తాం. నసీర్, ఇంచార్జి డివిజనల్ పంచాయతీ అధికారి త్వరలోనే నివేదిక ఇస్తామని గతంలో ఇక్కడ పని చేసిన డివిజనల్ పంచాయతీ అధికారి పండరీనాథ్, అడ్డాకుల గ్రామ పంచాయతీపై జరిగిన అవినీతి నివేదికను ఇంతవరకు మాకు సమర్పించలేదు. గతవారం రోజుల క్రితం రిటైర్మెంట్ కావడం జరిగింది. త్వరలోనే అడ్డాకుల గ్రామ పంచాయతీలో చేపట్టిన విచారణ నివేదికను అందిస్తామని జిల్లా పార్థసారథి పంచాయతీ అధికారి తెలిపారు.

# పట్టణంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి..

అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల,అక్టోబర్ 16 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలో పెండిం గులో ఉన్న లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం ఎల్ఆర్ఎస్ దర ఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. యం.సంతోష్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్సుహాల్‌నందు మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరి ష్కారం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. పెండింగులో ఉన్న దరఖాస్తుల వివరాలను మున్సిపాలిటీల వా రిగా ఆడిగి తెలుసుకున్నారు. ప్రతి మునిన్సిపల్ పరిధిలో రోజు కు కనీసం 15దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన సమయంలో ప్రభుత్వ భూ మి,కోర్టు కేసులు,చెరువులు, కుంటల పరిధిలో ఉన్న భూముల అంశాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా క్షేత్రస్థా యిలో పక్కాగా పరిశీలించుకోవాలని అధికారులకు సూచించా రు. ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా తగిన మార్గదర్శ కాలను పాటిస్తూ, సమగ్ర సమన్వయంతో సంబంధిత శాఖ అధికారులు విచారణ నిర్వహించి దరఖాస్తులను పరిష్కరించాల ని ఆదేశించారు. చేపట్టిన పనులను ప్రతిరోజు పర్యవేక్షించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. మున్సిపల్ వార్డులలో ప్రతి రోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్త ప్రతిరోజు సేకరించాలన్నారు. మున్సిపా లిటీలలో ఇంటి పన్ను సేకరణ నత్తనడకన సాగుతుందని కలెక్ట ర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టాక్స్‌కలెక్షన్ వందశాతం పూర్తి చేయాలని ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనా రాయణ, నర్సింగరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ శాఖ ఏఈలు, రెవెన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ..

**ఫలించిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృషి**

**10 గ్రామాలకు రహదారులను మంజూరు చేసిన ప్రభుత్వం**

**అభినందిస్తున్న నియోజకవర్గ ప్రజలు**

**దేవరకద్ర,అక్టోబరు 16 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని గ్రామీ ణ రహదారులకు మహర్దశ రాబోతుంది. నియోజకవర్గంలోని దాదాపు 10గ్రామాలకు ప్రభుత్వం రహదారులను మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృషి ఫలించింది. త్వరలో మరికొన్ని గ్రామాలకు కూడా ప్రభుత్వం రహదారులు మంజూరు చేయ నుంది. దేవరకద్ర నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రా మాలకు మంజూరైన రహదారులు ఈ విధం గా ఉన్నాయి. అడ్డాకు ల మండలంలోని రాచాల నుండి ఇసంపల్లి వరకు రహదారిని ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే చిన్నచింతకుంట మండలం నెల్లికొండి వరకు వయా సీతారాంపేట మీదుగా రహదారిని మం జూరు చేసింది. దేవరకద్ర మండలం గద్దెగూడెం నుండి కోటకదిర వరకు, దేవరకద్ర మండలం చిన్నారా జమూరు నుండి వయా నాగ న్నపల్లి మీదుగా కోయిల్‌సాగర్ వర కు, దేవరకద్ర మండలం బస్వా యిపల్లి నుండి నందిపేట వర కు, అడ్డాకుల మండలం ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి చౌడయ్యపల్లి వరకు, అడ్డాకుల మండలం జడ్పీ రోడ్ రాచాల నుండి దుబ్బపల్లి వరకు, అడ్డాకుల మండలం కందూర్ నుండి వడ్డేపల్లి వరకు, చిన్నచింతకుంట మండలం లక్ష్మీదేవిపూర్ నుండి నంద్యాల మద్దూరు లింక్ రోడ్డు, కొత్తకోట జడ్పీ రోడ్డు నుండి వయా సత్యహళ్లి మీదుగా వడ్డెవాట వరకు ప్రభుత్వం రహదారిని మంజూరు చేసింది. దీంతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని అభినందిస్తున్నారు. రహదారుల మంజూరు విషయంలో ఆయన చేసిన కృషిని కొనియాడుతున్నారు.

**కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన సాధ్యం..**

**ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

కాంగ్రెస్‌తోనే సుస్థిరపాలన సాధ్యమవుతుందని దేవరకద్ర నియోజ కవర్గం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధి ధ్యే యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్ర భుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామాభివృద్ధి

– మిగతా4లో..

# వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మాగనూరు,అక్టోబరు 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో నేడు పౌర సరఫరాల సంస్థ ద్వారా వరిధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ రైతుల బాగుకోసం నిరంతరం కృషి చేసి ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ఆనాడు రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ,

– మిగతా4లో..

## పటేల్ అంతిమయాత్రలో హాజరైన ఎమ్మెల్యే

**గద్వాల,అక్టోబర్ 16 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలోని అనంతపురం సమీపంలో దయ్యాల వాగు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పటేల్ ప్రభాకర్ రెడ్డి తనయుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి తనయుడు పటేల్ రామచందర్‌రెడ్డి మృతి చెందారు. కుర్తిరావుల చెరువు గ్రామంలో అంతిమయాత్రలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్ర పాడెను ఎమ్మెల్యే మోసారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని మన స్ఫూర్తిగా ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట గద్దం కృష్ణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, బండ్ల చంద్రశే ఖర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బిజ్వార్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, రాజారెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, సీతారామ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పటేల్ అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

## రంగంపేట, ఉప్పునుంతల రోడ్డును బాగు చేయండి

**ఉప్పునుంతల,అక్టోబరు 16 ప్రభాతవార్త :** మండల కేంద్రం నుంచి రంగంపేటకు వెళ్లే మట్టి రోడ్డును బాగు చేయాలని రంగంపేటకు వెళ్లే మట్టి రోడ్డును బాగు చేయాలని రంగంపేట గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. దీంతో ఉప్పునుంతల నుంచి రంగంపేటకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం రైతులు ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఈ రోడ్డుపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. రోడ్డు కుంగిపోయి పెద్దగుంత ఏర్పడడంతో రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఉప్పునుంతల నుంచి రంగంపేట వరకు బిటి రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అద్వానంగా తయారైన ఉప్పునుంతల రంగంపేట రోడ్డు

## వద్ద బస్సు ఆపాలని గ్రామస్తుల వినతి

**ఉప్పునుంతల,అక్టోబరు 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని హైదరాబాద్ శ్రీశైలం హైవేపై పిరట్వాన్‌పల్లి గేటు వద్ద ఆర్టీసి బస్సులను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటి నుంచి తమ గ్రామస్టేజీ వద్ద బస్సులు ఆగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిరట్వాన్‌పల్లి, సూర్యతండా, పిరట్వాన్‌పల్లి తండా గ్రామస్తులు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేస్తే చెన్నారం లేదా వెల్టూరు స్టేజీల వద్ద దిగాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడి నుంచి 2 కి.మీ మేర కాలినడకన గ్రామాలకు చేరుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. రాత్రివేళల్లో మహిళలు, వృద్ధులు చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చే విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొన్నారు. పిరట్వాన్‌పల్లి స్టేజీ వద్ద ఆర్టీసి బస్సులను నిలపాలని కోరుతూ గ్రామస్తులు డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు వారు తెలిపారు.

## ముడా చైర్మన్‌కు ఘన సన్మానం

**కొత్తకోట అక్టోబర్ 16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ అర్బన్ రూలర్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమించబడిన లక్ష్మయ్య యాదవ్ ని కొత్తకోట మండల యాదవ సంఘం నాయకులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ముడ చైర్మన్ గా యాదవ్ కులస్తుని నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి,మహబూబ్‌నగర్ శాసనసభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట మండల యాదవ సంఘం తరపున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కాంగ్రెస్‌పార్టీ పట్టణఅధ్యక్షులు కదిరేసాయిలు యాదవ్, మార్కెట్ మాజీ డైరెక్టర్ పెంటన్న యాదవ్, శ్రీ కురుమూర్తి దేవస్థానం మాజీ డైరెక్టర్ పెండెం శంకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి రాములు యాదవ్, నాగారపు రాజు యాదవ్ పాల్గొన్నారు.

ముడా చైర్మన్‌ను సన్మానిస్తున్న యాదవ సోదరులు

## సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఉప్పునుంతల,అక్టోబరు 16 ప్రభాతవార్త :** సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కుచట్టం పరిరక్షణ ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంఛార్జి మొగిలి శేఖర్ అన్నారు. బుధవారం సమచార హక్కు రక్షణ చట్టం 2005 ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యజ్యోతి ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమంలో కేక్ కట్‌చేసి పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వాటి నిధుల వినియోగం గురించి ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుని తెలుసుకోవచ్చున్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు చేయడానికి ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉప్పునుంతల మండల అధ్యక్షులు సిఎస్ నరేష్, మండల ప్రచార కార్యదర్శి ఆంకురి విజయ్, జి. ప్రశాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రుక్మిణి మాత కళ్యాణోత్సవం...

**ఆత్మకూరు అక్టోబర్ 16 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో గల శ్రీ పాండురంగ స్వామి దేవాలయంలో బుధవారం రుక్మిణి మాత కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పాండురంగ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని పుర వీధుల గుండా అలంకారం ఉత్సవం నిర్వహించి మధ్యాహ్నం శ్రీనాథ్ రెడ్డి అశ్విన్ దంపతుల సమక్షంలో రుక్మిణి మాత కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు గురువారం కూడా గందోత్సవంతో ముగియసిట్లుగా ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీధర్ జోషి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ యుగేంధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఆనంద్ గౌడ్, భీమన్న, వెంకటన్న, తదితరులతో పాటుగా పలువురు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూలమల్ల గ్రామంలో రుక్మిణీ మాత కళ్యాణోత్సవం

నిర్వహించిన అనంతరం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్మన్..!!

**భూత్పూర్,అక్టోబర్ 16,ప్రభాతవార్త :** బుధవారం భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాల్లో జరిగిన పలు శుభకార్యాల్లో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వ రాజ్‌గౌడ్ పాల్గొని నూతన వధూవరుల్ని ఆశీర్వ దించారు.భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో జరిగిన అనూష- శివుడు వివాహ కార్య క్రమంలో పాల్గొని నూతన వధూవరుల్ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పోతులమడుగు గ్రామంలో మాధవి- శ్రీకాంత్‌ల వివాహా నికి హాజరై నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనె మోని సత్యనారాయణ,సత్తూర్ నారాయణగౌడ్,మొల్గర నర్సింహులుగౌడ్,సత్తూర్ అశోక్‌గౌడ్,టి మురళిధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి, గద్దం రాములు,గద్దం ప్రేమ్,సత్తూర్ సురేష్‌గౌడ్,సత్తూర్ రాకేష్‌గౌడ్,సత్తూర్ వెంకటేష్‌గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

భూత్పూర్‌లో అనూష-శివుడు వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆల,మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ తదితరులు

# పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయురాలు

నూతన ఉపాధ్యాయులకు సన్మానం చేసిన మండల విద్యాధికారి

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు

**వీపనగండ్ల అక్టోబర్ 16 ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల పాఠశాలలకు నూతనంగా ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలకు 13 మంది ,జిల్లా పరిషత్ హై స్కూల్ లకు 6 మంది.బుధవారం నాడు జైనింగ్ కావడం జరిగింది. ఈనెల 9వ తేదీన హైదరాబాదులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయులకు అపాయిం ట్మెంట్ లెటర్‌ను ఇవ్వడం జరిగింది. అటు పిమ్మట సెలవులు ఉన్న కారణంగా వారి పాఠశాలలో ఉన్న ఖాళీలలో జైనింగ్ కావడా నికి కొంత ఆలస్యమైంది అయితే మంగళవారం నాడు నూతనంగా ఆ యా మండలాలలో ఖాళీగున్న ఉపాధ్యాయ పోస్టులకు విద్యాశాఖ ఇంటర్వ్యూ నిర్వహించి వాటి ఖాళీలను భర్తీ చేసి ఆయా పాఠశాలకు నూతన ఉపాధ్యాయులను పంపడం జరిగింది. అయితే వీపనగండ్ల మండలంలో మొత్తం ఖాళీలు పీఎస్ యుపిఎస్ లో 33 ఖాళీలు ఉండగా కొత్తగా పదిమంది ఉపాధ్యాయులు ముగ్గురు గతంలో ఇక్క డికి బదిలీ అయిన వారు బుధవారం నాడు జైనింగ్ కావడం జరిగిం దని ఎంఈఓ నరసింహులు తెలిపారు. భర్తీ అయిన ఉపాధ్యాయ పోస్టులను పరిశీలిస్తే ఆయా గ్రామాలకు ఎస్జిటి పోస్టుల్లో ఉపాధ్యా యులు జైనింగ్ అయినట్లు ఆయన తెలిపారు. వీపనగండ్ల ఎంఆర్పి ప్రాథమిక పాఠశాలకు ముగ్గురు ,బొల్లారం ప్రాథమిక పాఠశాలకు ఒక్కరు ,వీపనగండ్ల ఎస్సీ పాఠశాలకు ఒక్కరు, కొల్లకుంట ప్రాథమిక పాఠశాలకు ఒక్కరు, గోపాల్దిన్నె ప్రాథమిక పాఠశాలకు ఒక్కరు, పుల్గర్ జర్ల ప్రాథమిక పాఠశాలకు ఒక్కరు, వల్లభాపురం ప్రాథమిక పాఠశాలకు ఒక్కరు, చొప్పున జైనింగ్ అయినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా అయితే ఇటీవల బదిలీలు జరిగినప్పుడు మండలం నుం డి 17 మంది ఉపాధ్యాయులు రిలీవ్ కావడం జరిగిందని ఆయన తెలిపారు. అయితే ప్రస్తుతం 13 మంది ఉపాధ్యాయులు రాగా ఇం కా 20 మంది ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా పోస్టులు మిగిలాయని ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాలలకు కూడా ఉపాధ్యాయులు రావడం జరిగిందని వారు ఆరు మంది రాగా వీపనగండ్లకు ఉపాధ్యాయులు పిఈటి తెలుగు ,కల్వరాళ్లకు హిందీ ,సంగినేని పల్లెకు ఇంగ్లీషు, బొల్లారం కు హిందీ, సంపత్‌రావుపల్లి యుపిఎస్‌కు ఒక్కరు రావడం జరిగింది.

### నూతన ఉపాధ్యాయులకు ఘన స్వాగతం

**పెబ్బేరు అక్టోబర్ 16 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో బుధవారం రోజు నూతనంగా నియమించబడిన ఉపాధ్యాయులు పెబ్బేరు మండ లంలో ఖాళీగా ఉన్న తిప్పాయిపల్లి, పెంచికలపాడు,పెబ్బేరు, సుగు రు, యాపర్ల, ఈర్లదిన్నె ప్రాంతాలలో ఖాళీగా ఉన్నందున ఎస్జీటీలు 4 స్కూల్ అసిస్టెంట్ 5 మంది ఈ ప్రాంతాలకు నియమించబడి నట్లు ఎంఈఓ జయరాములు తెలిపారు. 2024 డిఎస్సి ద్వారా ఎంపికై పెబ్బేరు మండలానికి విచ్చేసిన నూతన ఉపాధ్యాయులకు పిఆర్టియు టిఎస్ పెబ్బేరు మండల శాఖ తరపున ఘన స్వాగతం పలకడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి పెబ్బేరు మండల ఎంఈఓ ఎస్ జయరాములు మాట్లాడుతూ పెబ్బేరు మండలానికి నూతనంగా ఎంపికైనటువంటి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేసి పెబ్బేరు మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని అన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి చిన్న రాములు, బి దుర్గాప్రసాద్ యాదవ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మహేష్, రాష్ట్ర కార్యదర్శి దయానంద్, ప్రాథమిక సభ్యులు అరుంధతి, నరసమ్మ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

**కొత్తకోట అక్టోబర్ 16 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి రవి యాదవ్‌కు టీచర్ ఉద్యోగం వచ్చిన సందర్భంగా బిఆర్ఎస్‌నాయకులు నరోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ నాయకులతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రామానికి మంచి తీసుకొచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, భాస్కర్,చారి,నక్కల శాంతన్న, వడ్డే నాగరాజు, దారమోని మొగులయ్య, వాకిటి నర్సింహా, వెంకట్ కుమార్, ధనుష్, బాబు డీకే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి విగ్రహ పున:ప్రతిష్ఠా మహోత్సవములు..

**మల్దకల్ అక్టోబర్ 16 ప్రభాతవార్త :** ఆదిశిలా క్షేతం మల్దకల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణముగావించిన శిలామంటపములో వాల్మీకి విగ్రహ పున:ప్రతిష్ఠా మహోత్స వములు రెండవ రోజు బుధవారం హోమాలు నిర్వహించారు. ఇట్టి ప్రతిష్టాకార్యక్రమంలో రమేష్ చారి, ప్రసన్న చారి, ప్రాణేష్ , రవి, హర్ష, వెంకోబారావు, చంద్రశేఖర్ రావు, చక్రధర్ తదితరులు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇంకా దేవాలయం చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, వాల్మీకి పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉదయం ఆవాహిత దేవతా హోమములు, గణపతి, పురుషసూక్త, మన్యు, పవమాన, శ్రీసూక్త, రామాయణసూక్త హోమాలు జరిగాయి. సాయంత్రం దీక్షహోమవ, గ్రామోత్సవం, మహాన్నపనము, శయ్యాదివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం కార్యక్రమాల్లో నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి, స్వస్తి, తీర్థప్రసాదముల వితరణ జరిగాయి. రేపు శ్రీవాల్మీకి విగ్రహ ప్రతిష్ట గురువారము పౌర్ణమి ఉదయం 5.05 ని. లకు రోహిణి నక్షత్రయుక్త మందు వాల్మీకి విగ్రహము ప్రతిష్ఠలు, నేత్రోన్మీలనం, ప్రాణ ప్రతిష్ఠ జ్వాలాదర్శనం, గోదర్శనం, కుంభం, బలిహరణం పూర్ణాహుతి, ఆశర్వచనం కార్యక్రమములు జరుగుతాయి అనంతరం అన్న దానం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతిరోజు వాల్మీకి రామాయణ పారాయణము, ప్రవచనములు, భజనలు కలవు. కావున భక్తాదులు ఈ కార్యక్రమ సందర్భముగా జరిగే పూజా కార్యక్రమాలలో పాల్గొని ప్రతిష్ట కార్యక్రమములను తిలకించి స్వామి వారి ఆశీర్వాదాన్ని పొందగలరని మల్దకల్ గ్రామ వాల్మీకి సంఘం ఒక ప్రకటనలో తెలిపారు.

హోమం నిర్వహిస్తున్న పండితులు

## సేవా పథకాలకు పోలీస్ అధికారుల ఎంపిక..

**గద్వాల, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** 2024 సంవత్సరంనకు గాను రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలోని వివిధ విభాగాలలో పోలీస్ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఉత్కృష్ట, అతి - ఉత్కృష్ట సేవ పతకాలకు ఎంపిక చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు తెలిపారు. జోగుళాంబ గద్వాల్ జిల్లా నుండి వివిధ హోదాలో ఉన్న అధికారులు వారి విధుల లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవ పతకానికి ఎంపిక అయినట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు. అతి ఉత్కృష్ట సేవ పతకానికి అధికారులు ఎంపిక య్యారు. సిసిఎస్ ఎస్సై ఏ.అరుణ, సిసిఎస్ ఎస్సై ఏం.సైలజ, హెచ్‌సీ -95, సుంకన్‌బాబు, హెచ్‌జి-19 షేక్ నిజాముద్దీన్, ఉత్కృష్ట సేవ పతకానికి ఎంపికైన పోలీసు అధికారులు సీఐ జి .రవిబాబు, ఏఆర్‌హెచ్ 2785 టీ.వెంకట్ పోలీస్ సాయుధ దళ కార్యాలయం ఎంపికయ్యారు. పోలీస్ సాయుధ దళ కార్యాలయంఒ పని చేసే వై.జమ్మన్న ఏఆర్‌హెచ్‌సి, పీసీ ఏ.రేఖారెడ్డి ఖలీల్, జె.చెన్నకేశవులు, టి.శ్రీనివాసులు, హెచ్‌జి 439, పోలీస్ సాయుధ దళ కార్యాలయం లు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా నుండి ఉత్కృష్ట అతి -ఉత్కృష్ట సేవ పతకాలకు ఎంపికైన పోలీసు అధికారులకు అభినందనలు తెలియజేశారు. విధి నిర్వహణను బాధ్యతతో నిర్వహించిన వారికి డిపార్ట్‌మెంట్‌లో తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని జిల్లా పోలీసు యంత్రాంగం అంత కూడా తమ విధులను బాధ్యతగా నిర్వర్తించి మరింతగా ప్రజల మన్ననలు పొందుతారని ఆకాంక్షించారు.

సీఐ రవిబాబు

ఎస్ఐ అరుణ

హెచ్‌సి నిజాముద్దీన్

## మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ

**దేవరకద్ర,అక్టోబరు 16 ప్రభాతవార్త :** చౌదర్‌పల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన బిఆర్ఎస్ యూత్ నాయకుడు హరీష్ తండ్రి ఆర్టీసి ఉద్యోగి శ్రీనివాసులు కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. గత కొన్ని రోజులుగా శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం ఆయనను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ శ్రీనివాసులు చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మృతుని స్వగ్రామమైన చౌదర్‌పల్లి గ్రామానికి వచ్చి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు కురువ శ్రీకాంత్ యాదవ్, రైతు సమితి మండల అధ్యక్షుడు కొండారెడ్డి, మాజీ సర్పంచ్‌లు యుగందర్‌రెడ్డి, నరెందర్‌రెడ్డి, యూత్ నాయకులు చలమారెడ్డి, యుగందర్‌రెడ్డిలతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

## నూతన ఉపాధ్యాయులకు నియామకపు పత్రాలు అందజేసిన ఎంఈఓ ఉషారాణి

**భూత్పూర్,అక్టోబర్ 16,ప్రభాతవార్త :** ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో భూత్పూర్ మండలానికి సెకండరీ గ్రేడ్ టీచర్స్‌గా నియమితులైన ముగ్గురు నూతన ఉపాధ్యాయులకు బుధవారం మండల విద్యాధికారిణి ఉషారాణి తన కార్యాలయంలో నియామకపు పత్రాలు అందజేశారు.నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు రాఘవేందర్‌ను మండలంలోని మద్దిగట్లకు,అనితను మీట్యతండాకు, భానుప్రకాష్‌ను లంబడికుంట తండాకు నియమిస్తూ మండల విద్యాధికారిణి ఉషారాణి నియామకపు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ ఉషారాణి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులతో పాటు మండలంలో పనిచేసే ఉపాధ్యాయులందరూ ఉత్తమమైన బోధనాసేవలతో మండల విద్యాభివృద్ధికి తోడ్పాటునివ్వాలని సూచించారు.నూతన ఉపాధ్యాయులు రాఘవేందర్,అనిత, భానుప్రకాష్‌లను ఎంఈఓ ఉషారాణితో పాటు పీఆర్‌టీయు టీఎస్ మండలశాఖ అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్ నూతన ఉపాధ్యా యులకు శాలువలు,పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొప్పోలు యాదయ్య, యూనియన్ నాయకులు సురేష్‌రెడ్డి,సాయిరాంగౌడ్,మండల ఉపాధ్యక్షుడు దస్తయ్య పాల్గొన్నారు.

నియామకపు పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ ఉషారాణి

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బాల్‌రాజ్‌గౌడ్

## బారికేడ్లను ఏర్పాటు చేయాలి

ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

**కృష్ణ,అక్టోబరు 16 ప్రభాతవార్త :** కృష్ణా మండలం గుడెబల్లూరు గుండా వెళ్లే జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 167) గ్రామంలో మూలమలుపు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాల వల్ల తృటిలో ప్రాణాలతో బయటపడ్డవారు చాలా మంది ఉన్నారు. ఇప్పటివరకు పదుల సంఖ్యలో గ్రామస్తులు, వందలాది మూగజీవాలు చనిపోయాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని గుడెబల్లూరులోని జాతీయ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఎలాంటటి ప్రాణనష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

ఆర్థికసాయం చేస్తున్న సంస్థ సభ్యులు

**కొత్తకోట అక్టోబర్ 16 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణం 14వ వార్డుకు చెందిన జనంపల్లి జీవన్న (65) అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న జె.ఎస్ రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె.మహిమ రాజు, జె.సతీష్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేస్త్రి బాబు, విద్యాసాగర్, నారమన్ సన్నయ్య, పాలెం కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యాలలో పాల్గొన్న ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర,అక్టోబరు 16 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలంలో బుధవారం జరిగిన పలు వివాహ శుభ కార్యాలలో దేవరకద్ర నియోజ కవర్గం బిజెపి ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజుతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూత్పూర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు జాకీర్‌కు మాతృ వియోగం

**భూత్పూర్,అక్టోబర్ 16,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు అమిస్తాపూర్‌కు చెందిన జాకీర్‌కు మాతృ వియోగం కల్గింది.ఆయన మాతృమూర్తి బురాన్‌బీ బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు.విషయం తెల్సుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అమిస్తాపూర్‌కు వెళ్లి బురాన్‌బీ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు.మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శ్రీనివాస్‌రెడ్డి,కౌన్సిలర్ రామ కృష్ణ,కోఆప్షన్ సభ్యుడు ఆజీజ్ నాయకులు టి మురళిధర్‌గౌడ్, మూష బాలస్వామి, ఆగిరి వెంకటేశ్, ఆగిరి సత్యం,పాష,సుల్తాన్ పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

### - సీనియర్ జడ్జీ శ్రీదేవి

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ జడ్జీ శ్రీదేవి

**కల్వకుర్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సీనియర్ జడ్జీ శ్రీదేవి అన్నారు. కల్వకుర్తి పట్టణం లోని యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఇందిరనగర్ కాలనీలోని పాఠశాల విద్యార్థులకు బుక్కులు, స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి శ్రీదేవి పాల్గొని విద్యార్థులకు బుక్కులు, స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు విద్య పట్ల శ్రద్ధ పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, పట్టణ వాసులు చంద్రశేఖర్,యూత్ ఫర్ సేవా సభ్యులు అనిల్, భగవత్, ప్రణవ్, బాబీదేవ్, సతీష్ తదితరులు ఉన్నారు.

## జిల్లా కేంద్రంలో ఒగ్గు కథ మహోత్సవం నిర్వహించాలని వినతి

ఒగ్గు కథ మహోత్సవం నిర్వహించాలని వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, అక్టోబర్16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఒగ్గు బీర్ల కళాకా రుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా నూతనంగా చేసిన ఒగ్గు బీర్ల కళాకా రుల సంక్షేమ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్య క్షులుగా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిర బీర్ల రాఘవేందర్, ఉపాధ్యక్షులుగా వంగూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన బీర్ల రాములుతో పాటు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఒగ్గు కథ మహోత్సవం ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు.

## స్వామి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

### ■మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డి

మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**బాలానగర్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాయిని స్వామి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్య క్షులు చర్లకోల లక్ష్మారెడ్డి అన్నారు. బుధ వారం బాధిత కుటుంబాన్ని బాలానగర్ మండలం మొదంపల్లి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. తన సొంతంగా రూ.1,00,000, బిఆర్ఎస్ పార్టీ తరపున 2,00,000 ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. బాలానగర్ మండల యూత్ వింగ్ నాయకులు, మొదంపల్లి మాజీ వార్డు సభ్యులు నాయినిస్వామి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఈ సందర్భంగా స్వామి కుటుంబా నికి తమ ప్రగాఢసానుభూతి తెలిపారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గద్వాల నూతన సీఐగా టంగుటూరి శ్రీనివాస్ నియామకం

**గద్వాల అక్టోబర్ 16 ప్రభాతవార్త:** గద్వాల నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా టంగుటూరి శ్రీనివాస్ ను నియ మిస్తూ మల్టి జోన్2, ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్టి జోన్ 2 ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సీఐ టంగుటూరు శ్రీనివాస్ ను జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నియమిస్తూ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## మండల విద్యాశాఖ అధికారి ఘన సన్మానం

మండల విద్యాధికారిని సన్మానిస్తున్న నాయకులు

**కొత్తకోట అక్టోబర్ 16 ప్రభాతవార్త:** మదనాపూర్ మండల కేంద్రానికి విద్యాశాఖ అధికారిగా షేక్ ఫారూక్ హుసేన్ నియమితులు అయినా సందర్భంగా మదనాపూర్ మండల కేంద్రంలో విద్యాశాఖ ఆఫీసు చాం బర్లో టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజాద్ అలీ కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ రావుఫ్, మండల కాంగ్రెస్ నాయకుడు గుండ్రతీ సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ఐ డీ82 కాల్వకు మరమ్మత్తులు చేసి రైతులను ఆదుకోవాలి

ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి, పోతేపల్లి, లచ్చపురం గ్రామాల సమీపంలోని కేఎల్ఐ డీ-82 కాల్వలకు అడ్డకట్టలు ఏర్పాటు చేయడంతో కేఎల్ఐ కాల్వలు తెగిపోయి సాగునీరు రైతు పంట పొలాల్లోకి వస్తున్నాయని పోతేపల్లి గ్రామానికి చెందిన రైతులు ఇరిగేషన్ అధికా రులకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లచ్చపురం వద్ద కాల్వకు గండి పడటంతో సాగునీరు పంట పొలాల్లోకి చేరి పంటలు నీట మునగి రైతులు నష్టపోతు న్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి గండి పడిన కాల్వలను పూడ్చి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కొండలుయాదవ్, శ్రీశైలం, బాలస్వామి, శివ, మల్లేష్, ఎల్లయ్య, అమృతయ్య, వీరయ్య తదితరులు ఉన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**వెల్దండ, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్, తిమ్మినోనిపల్లి, బుద్దోనిపల్లి గ్రామాల్లో పశు వైద్యాధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ సంబంధిత పశుపోషక రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని, ఇట్టి టీకాల వల్ల పశువులలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గ్రామాల్లో పశువులకు టీకాలు వేసే సమయంలో తమ తమ పాడి పశువులకు టీకాలు వేసి ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్‌రెడ్డి, వెంకన్న, రియాజ్, నర్సింహ్మ, శ్రీను, తిరుపతయ్య, మొగులయ్య, బాలు, సాయిబాబా, విజయేందర్ తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

# వరికి రూ. 500ల బోనస్

### ■ చివరి గింజ వరకూ వరిని కొంటాం
### ■ రైతులు మోసపోకుండా చర్యలు
### ■ జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

నస్రుల్లాబాద్‌లో ఐకెపి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**జడ్చర్ల టౌన్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యంలో చివరి గింజ వరకూ కొనుగోలు చేయ డానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరాక్రాంతి పథంకు చెందిన మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు. జడ్చర్ల మండ లంలోని నస్రుల్లాబాద్‌లో బుధవారం ఐకెపికి చెందిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భం గానే అనిరుద్‌రెడ్డి మాట్లాడుతూ, వరి పండించే రైతులు మధ్య దళారుల చేతుల్లో మోసపోయి తక్కువ ధరలకే తాము పండిం చిన ధాన్యాన్ని అమ్ముకోకూడదనే లక్ష్యంతో మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని చెప్పారు. ఈ ఏడాది సన్న ధాన్యం క్వింటాల్‌కు రూ.2320లతో పాటుగా రూ. 500ల బోనస్ కూడా ఇస్తోందని చెప్పారు.దొడ్డు ధాన్యానికి రూ. 2300 ధర చెల్లిస్తోందని తెలిపారు. గత ఏడాదిలో జడ్చర్ల నియోజక వర్గంలోని జడ్చర్ల, నవాబ్‌పేట, బాలానగర్, రాజాపూర్, మిడ్జిల్, ఉర్కొండ మండలాల్లో రూ. 36.33 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు.ఈ ఏడాది కూడా ధాన్యం కొనుగో లుకు 40కుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలి పారు. బాలానగర్ మండలంలో చిన్నరేవల్లి, బాలానగర్, హేమా జీపూర్,మదంపల్లి, బాలానగర్ సింగిల్ విండో సొసైటీ, జడ్చర్ల మండలంలో బాదేపల్లి,నస్రుల్లాబాద్, కోడ్గల్,పెద్దఅదిరాల గ్రామా ల్లోనూ,మిడ్జిల్ మండలంలో బైరంపల్లి, చిలువూరు, దోనూరు, కంచన్‌పల్లి, కొత్తూరు,మల్లాపూర్, మసిగుండ్లపల్లి, మిడ్జిల్, మున్ననూరు, వల్లభురావుపల్లి, వెలుగొమ్ముల, వేముల, వాడ్యాల గ్రామాల్లోనూ నవాబ్‌పేట మండలంలో చౌడూరు, గురుకుంట, కాకర్లపహాడ్, కారుకొండ, కొల్లూరు, కూచూరు, లింగంపల్లి, లోకిరేవు, నవాబ్‌పేట, ఇప్పటూర్, రుద్రారం, పోమాల్ తదితర గ్రామాల్లోనూ రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి, రాఘవాపూర్, రాజాపూర్, రంగారెడ్డిగూడ గ్రామాల్లోనూ,ఉర్కొండ మండలంలో జకినాలపల్లి, బొంరాస్‌పల్లి, ఉర్కొండపేట గ్రామాల్లోనూ వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరిం చారు. ప్రభుత్వం ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరిధాన్యం కొను గోలు కేంద్రాల్లో తూకాలు సక్రమంగా ఉంటాయని, ఎంఎస్పీ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తారని, అందుకే రైతులందరూ ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని అనిరుధ్‌రెడ్డి కోరారు. కార్యక్ర మంలోబాదేపల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్‌తంగెళ్ల జ్యోతి, మార్కెట్ వైస్ ఛైర్మన్ రాజేందర్‌గౌడ్, జడ్చర్ల తహసిల్దార్, ఎంపిడిఓ, ఎఈఓ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సునిత, ఐకెపి ఏపిఎం మాల్యానాయక్ పాల్గొన్నారు.

# గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసింది

### ■ బీజేపీ కౌన్సిలర్ భరత్ భూషణ్

**కొత్తకోట అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అని బీజేపీ కౌన్సి లర్ భరత్ భూషణ్ ఎద్దేవా చేశారు. ఆలు లేదు సూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లుంది. కొత్తకోట పట్టణ, మం డల కాంగ్రెస్ నాయకుల తీరు అని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరు మీద అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. పెన్షన్లు పెంచుతామని చెప్పి పెంచలేదని అన్నారు. మహిళలందరికి 2500/ అని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మీ పథకంలో ఒక తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. ఇంది రమ్మ ఇండ్లకు ఐదు లక్షలు ఇస్తామని దాని ఊసే లేదని, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు దాని ఊసే లేదని అన్నారు. స్థానిక ఎన్నికలు సమిపిస్తున్న వేల ప్రజలకు అబద్దాలు చెప్పి స్థానిక ఎన్నికల్లో లాభం పొందాలని చేస్తున్నారని వీటిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కొత్తకోట పట్టణంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కొరకు కేంద్ర ప్రభుత్వం 15వ ఫైనాన్స్ క్రింద 574 లక్షలు మంజూరి చేసిందని గుర్తు చేశారు. అప్పటి శాసన సభ్యులు దానికై పోలీస్ స్టేషన్ సమీపానా శంకుస్థాపన చేసి శిలాఫలకం వేయడం జరిగిందని చెప్పారు. మాజీ శాసన సభ్యులు30 పడకల ఆస్పత్రి నిర్మాణం కొరకు 574 లక్షలు సరిపోవు 1100 వందల లక్షలు కావాలని ప్రభుత్వాన్ని కోరాడని చెప్పారు. ఒక సంవత్సరం గడిచిపోయిందని మంజూరి అయిన డబ్బులు తిరిగి వెళ్లి పోతాయి అని చెప్పారు.

కాంగ్రెస్ వారు ఎలాంటి ప్రొసీడింగ్స్ లేకున్నా 50 పడకల ఆస్పత్రి వచ్చినట్లువివిధ మాధ్యమాల ద్వారా ప్రజలను నమ్మించా లని, కయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. సంబంధిత హెల్త్ డిపార్ట్‌మెంట్ వారిని ఫోన్ ద్వారా విషయం అడుగగా 50 పడకల హాస్పిటల్‌మంజూరిఅయినట్లు మాకుఎలాంటి సమాచారం లేదని చెప్పడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత శాసన సభ్యుల, మాజీ శాసన సభ్యుల ఆధిపత్య పోరులో కేంద్రం ఇచ్చిన నిధులు మురిగి పోయే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. శంకుస్థాపన చేసిన దగ్గరే హాస్పిటల్ నిర్మాణం కొరకు పనులు ప్రారంభిం చాలని భారతీయ జనతా పార్టీ కోరుతుందని తెలిపారు.

# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షులు దారమోని గణేష్

**కల్వకుర్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్వీ కల్వ కుర్తి అధ్యక్షులు దారమోని గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించి నిర్వీర్యమవుతున్న విద్య వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. విద్యా సంస్థల్లో ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్స్ తిరిగి ఇవ్వడానికి ప్రైవేటు విద్యా సంస్థల యాజ మాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లను తిరిగి తీసుకోవడం కోసం బయట అప్పులు చేసి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్స్ పొందే దౌర్భాగ్య స్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం ఏశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఫీజు బకా యిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడా ల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. విలేకరుల సమావే శంలో బీఆర్ఎస్వీ నాయకులు వట్టెపు కిశోర్, తాళ్ల సురేష్‌గౌడ్, పాండు, వట్టెపు గణేష్, కృష్ణ తదితరులు ఉన్నారు.

# పండిన ప్రతి వడ్ల గింజను కొనుగోలు చేస్తాం

### ■ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఈ ఏడాది వర్షాకాలంలో రైతన్నలు సాగు చేసిన వరి పంటకు సంబంధించి పండిన ప్రతి వడ్ల గింజను కొనుగోలు చేస్తామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పట్టణంలో ప్రారం భించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండిం చిన వరి ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు సన్న రకాల వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందజేస్తామన్నారు. రైతులు ఏమాత్రం ఆందోళన చెందకుండా నేరుగా వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలన్నారు. కార్య క్రమంలో పిఏసిఎస్ కార్యదర్శి రాములు, గణేష్, ఆనంద్‌గౌడ్, రవికుమార్, బోయ వెంకటేష్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ■ ఎస్పై వై.భాగ్యలక్ష్మిరెడ్డి

అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**మక్తల్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** సమాజంలో ప్రస్తుతం ఎక్కువ జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మక్తల్ ఎస్పై వై. భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణ లో బుధవారం సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, కమ్యూనల్ గొడవలు, సోషల్ మీడియాలో అనుచిత పోస్టులపై, బాల కార్మిక వ్యవస్థ సిసి కెమెరాల ఉపయోగం మొదలగు పలు సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకి లోన్ ఇస్తా మని, గిఫ్ట్ ప్యాక్‌లు వచ్చాయని తక్కువ రేట్‌కు వాహనాలు దొరు కుతాయని,ఎవరైనా పై అధికారి వాట్సాప్ డిపి పెట్టుకుని వాట్సా ప్‌లో మెసేజ్ చేసి డబ్బులు పంపమని అడిగితే పంపరాదని మొబైల్ ఫోన్‌లో బ్లూ లింక్స్ ఓపెన్ చేయరాదని, ఎవరైనా ఓటిఎ లు అడిగితే చెప్పరాదని, మోసపూరిత ఆశలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకరయ్య,హెడ్ కానిస్టేబుల్ లాల్‌సింగ్, సిబ్బంది శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

సహాయం అందించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సాయికుమార్, వెంకటయ్యగౌడ్, పోల రవి, ఎండీ.రషీద్, సాయి, బొడ్డుపల్లి కొండల్, వెంకటేష్‌చారి, మహేష , పరుశరాములు తదితరులు ఉన్నారు.

**కల్వకుర్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** చారకొండ మండలం గోకారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన పంజుగుల లక్ష్మమ్మ కుటుంబాన్ని వెల్దండ మండల పీఏసీ ఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు పరామర్శించి రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ లక్ష్మమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. గతంలో లక్ష్మమ్మ భర్త వెంకటయ్య కూడా మృతి చెందడంతో పిల్లలు నిరాశ్రయులయ్యా రని, ఆ పిల్లల భవిష్యత్తుకు భరోసాగా ఉంటానాన్నరు. అదే విధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జక్కుల వెంక టయ్య కుటుంబాన్ని సైతం పరామర్శించి రూ.10వేల ఆర్థిక

## విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

### ■ఎంఈఓ మురళీకృష్ణ

నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేసిన దృశ్యం

**చిన్నచింతకుంట,అక్టోబరు 16 ప్రభాతవార్త:** నూతనంగా విధు ల్లో చేరిన ఉపాధ్యాయులు చదువుకుంటున్న విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం మండల వనరుల భవనంలో మండ లానికి కేటాయించిన 27 మంది నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందించారు. నూతన ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిం చేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యాభి వృద్ధికి కృషి చేయాలని కోరారు. పవిత్ర ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, సిఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యార్మీ వేడుకలు

గ్యార్మీ వేడుకల్లో పీఎసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు

**కల్వకుర్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** చారకొండ మండలంలోని జూపల్లి గ్రామంలో ముస్లిం సోదరులు గ్యార్మీ పండుగ వేడుక లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోద రులు మహబూబ్ సుభాని దర్గా వద్ద మలిదతో ప్రత్యేక పాతి హాలు ఇచ్చారు. గ్యార్మీ వేడుకల్లో వెల్దండ పీఎసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు పాల్గొని ప్రత్యేక ఫాతిహా కార్యక్రమంలో పాల్గొని దర్గాపైచద్దర్ సమర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నదాన కార్య క్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయ కులు వెంకటయ్యయాదవ్, ముస్లిం సోదరులు, దర్గా కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## నివాళులర్పించిన అలంపూర్ ఎమ్మెల్యే

భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

**ఇటిక్యాల,అక్టోబరు 16 ప్రభాతవార్త:** మల్దకల్ మండలం మాజీ జడ్పీటిసి పటేల్ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు పటేల్ రామచం ద్రారెడ్డి (28) బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా మార్గమధ్యలోని అనంతపురం సమీపంలో గల దయ్యాల వాగు కల్వర్టుకు కారు ఢీకొనగా తీవ్ర గాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా ఆయన మృతి చెందా రు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మల్దకల్ మండలం కుర్తిరావల్ చెరువు గ్రామానికి చేరుకుని పటేల్ రామచంద్రారెడ్డి భౌతిక కాయానికి ఎమ్మెల్యే విజయుడు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబానికిప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు వావిలాల రంగారెడ్డి, రఘురెడ్డి, అయిజ మండల సోషల్ మీడియా ఇంఛార్జి వీరేష్ పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న జమిస్తాపూర్ గ్రామస్తులు

**దేవరకద్ర,అక్టోబరు16 ప్రభాతవార్త:** జమిస్తాపూర్‌లో బుధ వారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్ల నరసింహారెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మల్ల నర్సింహారెడ్డి మొదటిసారిగా గ్రామానికి రావడంతో జెమిని శేఖర్ ఆధ్వ ర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకంకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

**గద్వాల అక్టోబర్16 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా యందు 2024-25 విద్యా సంవత్సరంనకు గాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత చదువులు చదువుటకు ఆర్థిక సాయం అందించుటకు టిఓఫ్ఈఎల్/జియంఎటి/ఐఈఎల్టిఎస్ నందు ఉత్తీర్ణత గల వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి బి.సరోజఒక ప్రకటనలో తెలిపారు. యూ.కే.యూ.ఎస్.ఏ, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్,న్యూజిలాండ్ మరియు సింగపూర్ వంటి దేశాలలో పేరుగాంచిన విశ్వవిద్యాలయాలలో చదువుటకు దరఖాస్తు చేసు కోవాలని, ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ నందు ఈ నెల 29 లోపల సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు వినియోగించు కోవాల్సిందిగా ఆమె కోరారు.

## పల్లెలకు కొత్త రహదారులు మంజూరు

**చిన్నచింతకుంట,అక్టోబరు 16 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారులకు నిధులు కేటాయిస్తూ మంజూరు చేసింది. మండలంలో నెల్లికొండి నుండి దమగ్నా పూర్ వయా సీతారాంపేట్ గ్రామాలకు బిటి రోడ్డును మంజూ రు చేసింది. లక్ష్మీదేవిపూర్ గ్రామం నుంచి మద్దూరు లింక్ రోడ్డు వరకు బిటి రోడ్డు మంజూరు చేసిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ రోడ్లు గుంతలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్న దుస్థితిని చూసి స్థానిక ఎమ్మెల్యే, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పల్లెలకు కొత్త రహదారులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రతి ఒక్కరూ బిజెపి సభ్యత్వం తీసుకోవాలి

■ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్

సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

**మిడ్జిల్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర గిరిజన అధ్యక్షులు డా.కళ్యాణ్ నాయక్, ముత్యాల జనార్ధన్‌రెడ్డి మిడ్జిల్ మండల కేంద్రానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం పరిశీలనకు ముఖ్య అతిథులుగా రావడం జరిగింది. వారిని మిడ్జిల్ మండల భారతీయ జనతాపార్టీ శాఖ అనుమానించడం జరిగింది. మెంబర్‌షిప్ డ్రైవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల దృష్టికి తీసుకువెళ్లి ప్రతి ఒక్క మెంబర్‌షిప్ తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్యాల జనార్ధన్‌రెడ్డి, భారతీయ జనతా పార్టీ జర్నల్ సెక్రెటరీ రాజేశ్వర్, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు నరెందర్, మహబూబ్‌నగర్ జిల్లా బిజెపి గెలిచిన మచ్చ ఉపాధ్యక్షులు నరేష్ నాయక్, మహెందర్, మండల ప్రధాన కార్యదర్శులు వాసు, వివిధ బూత్ అధ్యక్షులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే

**ఇటిక్యాల,అక్టోబరు 16 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు మల్దకల్ మండల మాజీ జడ్పీటిసి పటేల్ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు పటేల్ రామచంద్రారెడ్డి బుధవారం తెల్లవారుజామున దయ్యాలవాగు దగ్గర వాగు కల్వర్టుకు కారు ఢీకొనగా తీవ్ర గాయాలు తగలగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఐసిసి కార్యదర్శి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కుర్తిరావల్ చెరువు గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి ఆకుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి,రాష్ట్ర టెలికాం మెంబర్ ఇస్మాయిల్, నాయకులు తనగల సీతారాంరెడ్డి, లక్ష్మి నారాయణరెడ్డి, జోగుల రవి, మెడికల్ మద్దిలేటి యాదవ్ పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలి

గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్న డా. వెంకటేశ్వర్లు

**ఇటిక్యాల,అక్టోబరు 16 ప్రభాతవార్త:** గ్రామాలలో గల పశు యజమానులు తప్పనిసరిగా మూడు నెలల పైబడిన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు యజమానులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి, ధర్మవరం, షేక్‌పల్లి గ్రామాలలో మండల పశువైద్య డా. భువనేశ్వరి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం చేపట్టారు. పుటాన్‌దొడ్డి గ్రామంలో జరిగిన గాలికుంట నిరోధక టీకాలు కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఇందులో 145 తెల్ల పశువులకు, 110 గేదెలకు గాలికుంటు టీకాలు వేసినట్లు మండల పశువైద్య డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో విఎల్ఓ మసుమన్న, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెల్కిచర్లలో సురక్షా పోలీస్

**భూత్పూర్, అక్టోబర్16, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం వెల్కిచర్లలో బుధవారం ఫ్రెండ్లీ పోలీస్,సురక్షా పోలీస్ పేరిట కళా బృందం కళాజాత నిర్వహించారు.సైబర్ నేరాలు, బాలికలు, మహిళలపై లైంగిక దాడులు,మానవ అక్రమ రవాణాలు,పోలీస్ హెల్ప్ లైన్ 1930 వంటి వాటిపై గ్రామస్తులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎహెచ్‌టీయూ టీం,ఇతర పోలీసులు పాల్గొన్నారని భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## ఎస్సై కె.బాల్‌రాజ్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు

**నారాయణపేట టౌన్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఎస్సై కె. బాల్‌రాజ్ కోస్గి నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కోస్గి ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపి కోస్గి మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం శాంతి భద్రతను కాపాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ సూచించారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

**ఇటిక్యాల,అక్టోబరు16 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రానికి చెందిన నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థిని ప్రవళికను సామాజిక ఉద్యమకారుడు డా. ప్రేమ్‌కుమార్ కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పడ్డ కష్టాలను చూసి వారి కలలను సాకారం చేసిన ప్రవళికను డా.ప్రేమ్‌కుమార్ అభినందించారు. బాగా కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాధించిన ప్రవళికను అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుమారులతో పాటు సమానంగా కూతుళ్లను కూడా ఉన్నత చదువులకు పిల్లల చదువు కొరకు వారు పడిన కష్టానికి తగిన ఫలితం లభించిందని ఇదే ప్రోత్సాహం అందరి పిల్లల తల్లిదండ్రులు ఇవ్వాలని, అలాంటప్పుడే పిల్లల చదువులో మంచి ఫలితాలు సాధిస్తారని డా. ప్రేమ్‌కుమార్ కోరారు.

### బలహీన వర్గాల కోసం
## పండుగ సాయన్న సేవలు చిరస్మరణీయం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి పెద్ద ఎత్తున ముదిరాజులు మండల ప్రజలు తరలి రావడం సంతోషదాయకమన్నారు. గ్రామాలలో పార్టీలకతీతంగా గ్రామాభీవృద్ధికి నాయకులందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కంటే ముందు గ్రామాలోని అంబేద్కర్ ఇందిరాగాంధీ, వైయస్ రాజశేఖర్ రెడ్డిల విగ్రహాలకు పూలమాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సంఘం ఉపాధ్యక్షులు అనవేని కృష్ణయ్య ,మండల మత్స్యకారుల సంఘం అధ్యక్షులు రామ్‌పల్లి సాయిలు,గ్రామ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నవీన్, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు మన్నెం గౌడ్, బాలాంజనేయులుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సామల ఆంజనేయులు,ముదిరాజ్ సంఘంమండల నాయకులు గోనెలశ్రీనివాసులు,గొడుగు సత్యం,రామచంద్రయ్య,దేవేందర్,గోపి,మధు,మండలానికిచెందినపలువురునాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారులకు మహర్ధశ..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. దీనికి ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా సహకరించాలన్నారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అందరూ తమకు అండగా నిలవాలన్నారు. అప్పుడు దేనినైనా సాధిస్తానన్నారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 10 గ్రామీణ రహదారులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇక గ్రామాలలో అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఈనాడు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత మన ప్రజా ప్రభుత్వానికే సాధ్యమని అన్నారు. నేడు ఈ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా వరి సన్న రకాలకు వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రూ. 500 బోనస్‌ను కూడా అందించనున్నామని తెలియజేశారు. అధికారులు ఎలాంటి తప్పిదాలు జరగకుండా రైతులకు సంచులను అందించి, వారి అకౌంట్‌లో త్వరగా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన సూచించారు.

# మెడికల్ కళాశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి

◆ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిటీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా

ఆసుపత్రిలో పేషంట్స్‌తో మాట్లాడుతున్న వాల్త్ మెడికల్ అండ్ ఫ్యామిటీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా

**నారాయణపేట టౌన్,అక్టోబరు 16 ప్రభాతవార్త:** నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం నారాయణపేట మెడికల్ కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాలలో కేవలం ఒక సంవత్సరం తరగతులు కావాల్సిన వసతులే కాకుండా ద్వితీయ సంవత్సర తరగతులు నిర్వహించేందుకు అవసరమైన వసతి సౌకర్యం సమకూర్చాలని ఆమె సూచించారు. బుధవారం నారాయణపేట మెడికల్ కళాశాలను జిల్లా కలెక్టర్ సిక్తపట్నాయక్‌తో కలిసి పరిశీలించారు. కళాశాల మీటింగ్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపల్, టిజిఎమ్ఐడిసి అధికారులు, కళాశాల వైద్య నిపుణులతో ఆమె మెడికల్ కళాశాల నిర్వహణపై సమీక్షించారు. మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు ఏమేమి వసతులు కావాలని, ఇప్పటివరకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా అనాటమి, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాలకు సంబంధించి ఎలాంటి రిక్వైర్మెంట్ అవసరమని, ఆయా విభాగాల వైద్య నిపుణులతో చర్చించారు. ఒకసారి కళాశాలతరగతులు ప్రారంభించిన తర్వాత మళ్లీ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదని ఆమె తెలిపారు. తరగతులకు సరిపడా ఫర్నీచర్ వచ్చిందా? ఇంకా ఏమైనా అవసరం ఉంటే ఇండెంట్ పంపించాలని చెప్పారు. ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రెండో సంవత్సరం తరగతుల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే మెడికల్ కళాశాల 3వ అంతస్తులో బ్లడ్‌బ్యాంక్, డయాలసిస్,ఇతర ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెనుకబడిన ఈప్రాంతంలో వైద్యపరంగా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆమె సూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ అధికారుల బృందంతో కలిసి ఆమె నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని, చిన్నపిల్లల ఆసుపత్రిని పరిశీలించారు. చిన్నపిల్లల ఆసుపత్రిలోని వార్డులను తిరిగి, అక్కడి వైద్య సదుపాయాలను చూశారు. చిన్న పిల్లలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి మెయిల్ ఫిమేల్ వార్డులలో వికిత్స పొందుతున్న రోగులు, చిన్నపిల్లల తల్లులతో మాట్లాడి ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకోవాలని ఆమె సూచించారు. ఆసుపత్రిలోని ఫార్మసీ, ఆరోగ్యమహిళ, ఐసిటిసి విభాగాలకు వెళ్లిరోజుకు ఎంతమంది వస్తున్నారని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసిలో ఏఏ మందుల కొరత ఉందని తెలుసుకున్న ఆమెవాటి ఇండెంట్‌ను పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీ ఎమ్ఐడిసి ఎండి హేమంత్ ఐఎఎస్, ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల, అకాడమిక్ డిఎం ఈ శివరాం ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డా. రాంకిషన్, పాలమూరు మెడికల్ కళాశాల డైరెక్టర్ డా. రమేష్, టీజీ ఎమ్ఐడిసి చీఫ్ ఇంజనీర్, దేవేందర్‌కుమార్, ఈఈ జైపాల్‌రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా. సౌభాగ్యలక్ష్మి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. మల్లికార్జున్, వైద్య కళాశాల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిటీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా

ఆసుపత్రిని పరిశీలిస్తున్న హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిటీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా

# గ్రామాల్లో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు

### భగీరథ ఈఈ సుధాకర్‌సింగ్

మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్‌సింగ్

**బిజినపల్లి,అక్టోబరు 16 ప్రభాతవార్త:** గ్రామాల్లో మంచినీటి సరఫరా బాధ్యతగా సరఫరా చేయాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో మంచినీటిటి కలుషితాన్ని నివారించేందుకు గ్రామ సహాయకులు తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. పైపుల లీకేజీ, మంచినీటి సరఫరా చేస్తున్న సమయంలో పైపులు పగిలినప్పుడు తీసుకోవాలసిన చర్యలపై మంచినీటి సహాయకులకు ఆయన నైపుణ్యాలను వివరించారు. అదేవిధంగా ట్యాంకులను శుభ్ర పరిచే విధానం, మంచినీటిని క్లోరినేషన్ చేసే పద్ధతులను శిక్షణలో వివరించారు. ఎక్కడైనా చేతి పంపులు పాడైనప్పుడు వాటిని రిపేర్ చేసే విధానాన్ని ప్రతి ఒక్కరు నేర్చుకుని ఉండాలని ఆయన సూచించారు. గ్రామాలలో మంచినీటి సరఫరా అత్యంత కీలకమైన విషయమని దీనిపై ఎట్టి పరిస్థితుల్లో అశ్రద్ధ వహించరాదని ఆయన సూచించారు. కలుషిత నీటివల్ల అనేక రోగాలకు గురి కావాల్సి వస్తుంది. కలుషిత నీటి పట్ల అప్రమత్తతో వ్యవహరించాలని ఆయన సూచించారు. గ్రామాలను మంచినీటి సరఫరా బాధ్యతగా సరఫరా చేయాలని ఆయన కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. మిషన్ భగీరథ ఏఈ మద్దిలేటి మాట్లాడుతూ కాలనీలకు నీటిని సరఫరా చేసేటప్పుడు సమయపాలన పాటించాలని ఆయన కోరారు. నాలుగు రోజులపాటు నిర్వ హించే శిక్షణ కాలంలో చేతి పంపుల మరమ్మ తులు, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టడం,పంపు సెట్లు, ప్యానల్ బోర్డుల నిర్వహణ, నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.గ్రామంలో మంచినీటి పైప్‌లైన్‌ల నిర్వహణ, వాటర్ నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ ప్రక్రియపై నాలుగు రోజుల శిక్షణతరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాస్టర్‌ట్రైనర్ ధర్మారెడ్డి, గ్రామ సహాయకులు భీమనిరాము, కృష్ణయ్య పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ◆ నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించిన కలెక్టర్

నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించిన కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ సీఈఓ కాంతమ్మ

**గద్వాల అక్టోబర్ 16 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో డి.ఎస్.సి - 2024 ద్వారా కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ అనంతరం నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అందజేశారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నందు డి.ఎస్.సి - 2024 లో కొత్తగా నియమితులైన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు నియామక పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియమితులైన ఉపాధ్యాయులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగా రావు,జెడ్పి సిఈఓ కాంతమ్మ, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల దవాఖానాలో దారుణం

■ డాక్టర్లు లేకపోవడంతో నరుసులే డెలివరీ ■ శిశువు మృతి

**జడ్చర్ల,అక్టోబరు 16 ప్రభాతవార్త :** వైద్యులు లేరని నర్సులే డెలివరీ చేయడంతో శిశువు మృతి చెందిన ఘటన జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జడ్చర్ల మండల పరిధిలోని నాగసాలకు చెందిన కీర్తి ప్రసవం కోసం జడ్చర్ల దవాఖానకు చేరుకుంది. దవాఖానాలలో చేరిన సమయంలో అంతా నార్మల్‌గా ఉందని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాని ఇంతలోనే విషాదం నర్సుల రూపంలో ముంచుకొచ్చింది. ఇంతలోనే కీర్తికి పురిటి నొప్పులు రావడంతో డాక్టర్లు సమయానికి లేకపోవడంతో హెడ్‌నర్సు డెలివరీ చేయడంతో శిశువు మృతి చెందింది. సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో హెడ్‌నర్సు డెలివరీ చేయడంతో శిశువు మృతి చెందింది. సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల శిశువు మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తూ ఆందోళన నిర్వహించారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

### మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 16 ప్రభాతవార్త:** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలన త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఎంపిఓలు, ఇరిగేషన్, ఏఈలు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు,వార్డు ఆఫీసర్‌లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వారికి వస్తున్న సందేహాలను నివృత్తి చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో దరఖాస్తులను సత్వరం పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు వారి స్థాయిలో పెండెన్సీ తగ్గించుకోవాలని ఆదేశించారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు దరఖాస్తులలో కోర్టు కేసులు, ఆన్‌లైన్ నాలా తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, స్పెషల్ కలెక్టర్ ముకుందరెడ్డి, డిపిఓ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

## ధాన్యం సేకరణ సాఫీగా కొనసాగించాలి

◆ రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

◆ రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు16 ప్రభాతవార్త :** రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వానాకాలం 2024,25 పంట ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమావేశానికి ఆయా శాఖల అధికారులు ఐకెపి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు,సిసిలు ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురి కాకుండా పూర్తిగా పారదర్శకంగా ధాన్యం సేకరణ ముగిసే వరకు పకడ్బందీగా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కోసం వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా వేయింగ్ మిషన్, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కోసం ట్యాబ్‌లు సమకూర్చుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా త్రాగునీటి సౌకర్యం, టెంట్ ఏర్పాటు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలును నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రిడ్ ఏ రకానికి క్వింటాల్‌కు రూ. 2320 సాధరణ రకం రూ. 2300ల మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సన్నరకం ధాన్యంకు ప్రతి క్వింటాలుకు అదనంగా రూ. 500లు చెల్లించనున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపరిచే ప్రయత్నాలను ఎంత మాత్రం ఉపేక్షించడం జరగదన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలు రూ. 500ల బోనస్ చెల్లిస్తున్నందున ధాన్యం సేకరించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా పౌర సంబంధాల అధికారి వెంకటేష్, పౌర సరఫరాల సంస్థడిఎం విక్రమ్, అదనపు పిడి జోజప్ప, ట్యాబ్ ఇంఛార్జిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట టౌన్, అక్టోబరు16 ప్రభాతవార్త:** జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు అంబేద్కర్ విదేశీ విద్యానిధికి గాను దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి ఒక ప్రకటనలో తెలిపారు. మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మసి, సైన్స్ హుమానిటిస్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు పై చదువులు విదేశాలలో చదువుకొనే విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తులు నేరుగా ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారాదరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారులు కుటుంబ ఆదాయం రూ. 5 లక్షలకు మించకుండా వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలని ఈ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమేనని డిగ్రీ పరీక్షలో 60% మార్కులు కలిగి ఉండాలని గుర్తింపు పొందిన విదేశీ విశ్వ విద్యాలయంలో అడ్మిషన్ పొంది ఉండాలని పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## పశు క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

**నారాయణపేట టౌన్,అక్టోబరు16 ప్రభాతవార్త:** కాలానికి అనుగుణంగా పశువులకు సోకుతున్న గాలికుంటు నివారణ కోసం టీకాలను వేయనున్నట్లు పశు వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దామరగిద్ద మండలంలో అక్టోబర్ 16 నుండి నవంబర్ 14వరకు పశువులన్నింటికి (తెల్లజాతి, నల్లజాతి పశువులు )లకు మండలం పరిధిలో గల అన్ని నాలుగు నెలలపై బడిన పశువులన్నింటికి (తెల్లజాతి, నల్లజాతి పశువులు) ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పశువుల కాపర్లు ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**గద్వాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయం దగ్గర గల ఎస్ వీ ఆర్ లాడ్జి లో పేకాట శిబిర పై పోలీస్ లు దాడి చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న గద్వాల రూరల్ పోలీసులకు నమ్మదగిన సమచారం రాగ జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గద్వాల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సంయుక్తంగా పేకాట స్థావరం పై దాడి నిర్వహించి 12 మంది నీ అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారని,వారి నుండి 2,00790 రూపాయాల నగదు 6 బైక్‌లు, 13 మొబైల్స్ ఫోన్ లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు. దండు రాజు,గొల్ల గోవిందు, నంబి గోపీనాథ్, బాగి రెడ్డి గోపాల్ రెడ్డి, గొల్ల సురే